సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



నిబంధనలు గాలికి.. బాధ్యతలు చేతికి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలకమైన సమగ్ర శిక్ష పలు ఆరోపణలు ఎదుర్కొంటోంది. - 10లో



బాధితులకు అండగా ఉండండి

కష్టాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అండగా ఉండి వారికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
27.4 /24.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.2 - 27.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓగా ఓబులమ్మ బాధ్యతల స్వీకరణ



కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సి.ఓబులమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలో డీఎల్‌డీఓగా పనిచేసిన ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఇప్పటిదాక సీఈఓగా ఉన్న సుధాకర్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. సీఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ మైథిలి, ఇతర జెడ్పీ సిబ్బంది కొత్త సీఈఓ ఓబులమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

'రాయలసీమ' రిజిస్ట్రార్‌గా వైవీయూ అధ్యాపకుడు



వైవీయూ : యోగివేమన యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈయన విశ్వవిద్యాలయంలో శాఖ అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ సమన్వయకర్తగా, ట్రాన్స్‌పోర్ట్ విభాగ సమన్వయకర్తగా, వైవీయూ ప్రవేశాల సహాయ సంచాలకులుగా, న్యాక్ కోర్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. డాక్టర్ విజయ కుమార్ నాయుడును వీసీ కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి. పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జి మంత్రుల నియామకం



ఎస్.సవిత



బీసీ జనార్దన్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. వైఎస్సార్ జిల్లాకు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవితను నియమించారు. శ్రీ సత్యసాయిజిల్లా పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె టీడీపీ అభ్యర్థిగా తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. ఇక అన్నమయ్య జిల్లాకు రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన నంద్యాలజిల్లా బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఎంఎస్ నెంబరు 3ను జారీ చేసింది.

బేరమా.. వైరమా!



ఔనంటే బేరం.. కాదంటే వైరం..
ఇదీ మద్యం షాపుల
లాటరీ విజేతలకు టీడీపీ
నేతలు చేస్తున్న హెచ్చరిక.
అవును.. కుదిరితే రేటు చెప్పి
బేరమాడుతున్నారు....
కాదూ కూడదంటే వైరానికి సై
అంటున్నారు..
'ఇక్కడ దుకాణం తెరవద్ద'ని కొందరు..
'50 శాతం వాటా కావాల'ని
ఇంకొందరు.. 'గుడ్‌విల్ ఇస్తాం వదిలేసి
వెళ్లండ'ని మరికొందరు హుకుం జారీ
చేస్తున్నారు.
'కూటమి ప్రభుత్వమిది..
లక్కు మాదే.. కిక్కుమాదే'
అంటూ రెచ్చిపోతున్నారు.

- బ్రాందీ షాపులు అప్పగించాల్సిందిగా రెచ్చిపోతున్న పచ్చ నేతలు
- కమలాపురంలో పునీత్ బార్ అండ్ రెస్టారెంట్‌ను మూసివేయించిన ఎమ్మెల్యే
- జమ్మలమడుగులో అన్నీ షాపుల్లో 30శాతం ఇవ్వాల్సిందేనని ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, కడప: మద్యం షాపుల నిర్వహణకు లాటరీ ముగిసింది.షాపుల్లో వాటాల కోసం.. కమీషన్ల కోసం కూటమి నేతల దౌర్జన్యం ఇప్పుడే షురూ అయింది. కమలాపురంలో ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్య రెడ్డి ఏకంగా పునీత్ బార్ అండ్ రెస్టారెంట్‌ను మూయించారు. వద్దని చెప్పినా చెన్నూరులో మద్యం షాపునకు దరఖాస్తు చేసిన ఫలితంగా బార్ మూయించినట్లు తెలుస్తోంది. ముద్దనూరులో మద్యం దుకాణం అప్పగిస్తే సరే, లేదంటే మీరు ప్రారంభించేందుకు వీలు లేదని పచ్చనేతలు తెగబడినట్లు సమాచారం.

జిల్లాలోని మద్యం దుకాణాలకు విరివిరిగా దరఖాస్తులు చేసుకునేలా ఎక్సైజ్‌శాఖకు ప్రభుత్వం టార్గెట్ విధించింది. సరాసరిగా ఒక్కో షాపునకు 30 దరఖాస్తులు వచ్చేలా చూడాలని మౌఖికంగా ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో 139 షాపులకు 3,257 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా కమలాపురంలో అధికారపార్టీ నేతలు వ్యవహరించారు. మద్యం దుకాణాలకు మరెవ్వరూ దరఖాస్తులు చేయరాదంటూ కట్టడి చేశారు. ఫలితంగా వీరపునాయునిపల్లె, చింతకొమ్మదిన్నె మినహా ప్రతిషాపునకు సింగిల్ డిజిట్ దరఖాస్తులు లభించాయి. అయినప్పటికీ లాటరీలో తెలుగుతమ్ముళ్లకు చేదు అనుభవం ఎదురైంది. ఫలితంగా మద్యం దుకాణదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

పునీత్ బార్ అండ్ రెస్టారెంట్ మూత...

కమలాపురంలోని పునీత్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్యరెడ్డి మూయించారు. మద్యం షాపు టెండర్లల్లో బార్ నిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డి సోదరుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారనే కారణం చెబుతున్నట్లు సమాచారం. మీరెవ్వరూ మద్యం షాపులు వేయరాదంటూ చెప్పినా చెన్నూరు షాపునకు టెండర్‌లో పాల్గొన్నారని చెబుతూ పునీత్ బార్ తమకు కావాలని ఒత్తిడి పెంచినట్లు సమాచారం. కాదు, కూడదు అన్నారని మంగళవారం ఉద యం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అనుచరులు బార్ మూ యించినట్లు తెలుస్తోంది. మరోవైపు బీఆర్కే న్యూస్ అధిపతికి కమలాపురం నియోజకవర్గంలో నాలుగు మద్యం దుకాణాలు లభించాయి. వాటిని తమకే అప్పగించాలని, తమ వర్గీయులే నిర్వహణ చేపట్టాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. గుడ్‌విల్ అప్పగిస్తాం, షాపులు వదిలేసి వెళ్లాలంటూ హుకుం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

ముద్దనూరులో మాకే కావాలి..

ముద్దనూరు మద్యం షాపు లాటరీలో రమేష్ అనే వ్యక్తికి లభించింది. అక్కడి షాపు తమ వర్గీయులే నిర్వహించాలని, మీరు నిర్వహిస్తే సహించేది లేదని టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. ముద్దనూరు షాపు అప్పగించకపోతే మీరు నిర్వహించుకోలేరని నిర్మోహమాటంగా చెప్పినట్లు తెలుస్తోంది. నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ అనుచరులు కాకుండా ఇతరులకు లభించిన షాపుల్లో సైతం 30శాతం వాటా తమ వర్గీయులకు ఇవ్వాలని.. అలా వాటా ఇస్తేనే మద్యం షాపుల నిర్వహణ సాధ్యమవుతుందని తేల్చి చెప్పినట్లు సమాచారం.

కడపలో 50శాతం వాటా తమ వర్గీయులకు అప్పగించాలనే డిమాండ్ టీడీపీ పెట్టినట్లు తెలుస్తోంది. కడప నగరంలో టీడీపీ నేతలకు కేవలం 5మద్యం దుకాణాలు లభించాయి. మరో18 దుకాణాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. అందులో 3దుకాణాలు జనసేన వర్గీయులకు లభించడంతో వారికి గుడ్‌విల్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. తక్కిన లాటరీ విజేతలకు స్వయంగా తెలుగుతమ్ముళ్లు ఫోన్ చేస్తూ వాసన్నతో మాట్లాడి వెళ్లాల్సిందిగా చెబుతున్నట్లు సమాచారం. అలా వెళ్లి మాట్లాడిన లాటరీ విజేతలను 50శాతం వాటా కోరుతున్నట్లు తెలుస్తోంది. తమ వర్గీయులు దాదాపు 150 దరఖాస్తులు వేసి నష్టపోయారు. వారికి వాటా కల్పించాల్సిందిగా కోరుతున్నట్లు సమాచారం.

అదృష్టవంతులకు.. అద్దె భారం !

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లక్కీ డిప్ ద్వారా మద్యం షాపుల నిర్వహణకు లైసెన్సు దక్కించుకున్న వారు దుకాణాల ఏర్పాటుకు అవస్థలు పడుతున్నారు. అనుకున్న ప్రదేశంలో అద్దె రూములు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. మంచి వ్యాపారం జరుగుతుందనే ప్రాంతంలో అద్దె రూముల యజమానులు నెలకు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు అద్దెలు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఇక కడప నగర శివార్లలోని ఊటుకూరు, సాక్షి సర్కిల్, అలంఖాన్‌పల్లె సర్కిల్, రాజంపేట బైపాస్‌లోని వైఎస్ఆర్ సర్కిల్, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, ప్రాంతాలల్లో రూములకు మంచి గిరాకీ ఉండటంతో దాదాపు నెలకు రూ.లక్ష అద్దె చెల్లించి రూ. 10 లక్షలు అడ్వాన్స్ చెల్లించాలని అద్దె యజమానులు చెబుతుండటంతో మద్యం దుకాణదారులు నోరెళ్లబెడు తున్నారు. బుధవారం 139 మద్యం దుకాణాలను ప్రారంభం కావాల్సిన నేపధ్యంలో ఇంకా కొందరి యజమానులకు అద్దె రూములు దొరక్కపోవడంతో 30 నుంచి 50 మద్యం దుకాణాలు మాత్రమే ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం నుంచి మూసివేస్తుండడంతో ఆ రూముల కోసమూ కొందరు ముందే కర్చీఫ్‌లు వేస్తుండడం గమనార్హం.

జిల్లా అంతటా వర్షం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో ఒంటిమిట్ట మండలంలో అత్యధికంగా 42.8 మి.మీ వర్షం కురవగా అత్యల్పంగా కొండాపురంలో 4.6 మి.మీ వర్షం కురిసింది. అట్లూరు 41.8, బద్వేల్ 40.6, కడప 39.2, గోపవరం 38.6, బికోడూరు 35.8, సిద్దవటం 33.8, వేంపల్లి 33.6, సీకేదిన్నె 32.8, పోరుమామిళ్ల 31.8, కాశినాయన 31.2, చెన్నూరు 30.2, కలసపాడు 28.0, బిమఠం 27.2, మైదుకూరు 21.0, పెండ్లిమర్రి 20.8, వేంపల్లి 20.0, ఖాజీపేట 17.2, చాపాడు 16.8, వల్లూరు 16.6, చక్రాయపేట 16.4, కమలాపురం 16.2, వీఎన్‌పల్లి 13.4, ఎర్రగుంట్ల 12.8, దువ్వూరు 12.8, లింగాల 12.2, పొద్దుటూరు 11.2, రాజుపాలెం 11.0, పులివెందుల 10.0, జమ్మలమడుగు 9.4, ముద్దనూరు 9.2, పెద్దముడియం 8.2, సింహాద్రిపురం 7.6, మైలవరం 7.4, తొండూరు 4.8, కొండాపురం 4.6 మి.మీ వర్షం నమోదైందని అధికారులు వెల్లడించారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేది ఉదయం 10 గంటలకు స్థానిక జెడ్పీలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారని సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, అధికారులు ఖచ్చితంగా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు. జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో ప్రగతి నివేదికలను తీసుకు రావాలని సూచించారు.

175 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ :జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 175 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనూరాధ తెలిపారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరులలో కలుపుకుని 8 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, సా యంత్రం రెండు సెషన్లలో నిర్వహించిన టెట్‌కు 1490 మందికిగాను 1315 మంది హాజరయ్యారని ఆమె వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈఓ తెలిపారు.

సమావేశంలో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు



పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి

కడప కార్పొరేషన్ : జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీకి జవసత్వాలు కల్పించడానికి అనుసరించాల్సిన విధానాల గూర్చి చర్చించారు. అలాగే జిల్లా కమిటీ, నగర కమిటీ, అనుబంధ కమిటీలను త్వరగా నియమించాలని తీర్మాణించారు.

సజావుగా ఇసుక పంపిణీ

- నేటి నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ సౌకర్యం
- కలెక్టర్ శివశంకర్ లోతేటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలకు సజావుగా ఇసుకను పంపిణీ చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. మంళవారం తన క్యాంపు కార్యాలయంలో ఇసుక పంపిణీపై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు రీచ్‌లలో ఇప్పటికే ఇసుకను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. పెండ్లిమర్రి మండల పరిధిలోని నందిమండలం, కొత్తగంగిరెడ్డిపల్లె, కొండూరు, మాచునూరు, వల్లూరు మండలంలోని పైడికాల్వ, కొండాపురం మండలంలోని బెడుదూరు, చక్రాయపేట మండలంలోని మారెళ్ల మడక ఇసుక రీచ్‌లలో బుధవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆఫ్‌లైన్ ద్వారా మధ్యాహ్న 12 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు ఇసుకను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా రీచ్ వద్దకే వినియోగదారుడు వెళ్లి బుక్ చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి వినియోగదారుడు సొంత వాహనం లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనంలో ఇసుక తీసుకు వెళ్లవచ్చన్నారు. కాగా ఇసుకను 50 శాతం ఆన్‌లైన్‌కు, మరో 50 శాతం ఆఫ్‌లైన్‌కు అందుబాటులో ఉంచామన్నారు. గ్రామ సచివాలయ స్టాక్ ఇన్‌ఛార్జిలు బుకింగ్, డెలివరీలు నిర్వహిస్తారన్నారు. ఇందుకోసం వినియోగదారులు ఆధార్, మొబైల్ నెంబరు, లోకేషన్ ఫోటోలు తీసుకు వెళ్లాలన్నారు. జేసీ అదితిసింగ్, జిల్లా మైన్స్ అధికారి సూర్యచంద్రరావు, ఆర్ఐ విమలమ్మతోపాటు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బేల్దారి.. బతుకు బీడువారి..



- ఇసుక సంక్షోభంతో నిర్మాణరంగం కుదేలు
- పనులు లేక.. కాలే కడుపులతో కూలీల అవస్థలు
- నెలలో నాలుగు రోజులు కూడా పనులు దొరకని వైనం
- హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు



ఇక్కడ ఫొటోలో కనిపిస్తున్న వారంతా పొట్ట చేతపట్టుకుని వలస వచ్చిన కూలీలు.. పొద్దు పొడవక ముందే అడ్డా(సంధ్యా సర్కిల్) కు చేరుకుంటారు. అటుగా వచ్చిన ప్రతి ఒక్కరినీ కూలి పని కోసం ప్రాధేయపడతారు.. అటు నుంచి పనేమీ లేదన్న సమాధానం వస్తుంది.. అంతే.. బేలగా నేల వైపు చూస్తూ ఉండిపోతారు.. ఒకటి రెండు రోజులు కాదు మూడు నెలలుగా రోజువారి కూలీల దీనస్థితి ఇది. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక దొరకడం గగనంగా మారింది. ఫలితంగా నిర్మాణరంగం పడకేసింది.



కడప రూరల్ : కూలీల కడుపు తరుక్కుపోతోంది. పనులు కరువై బతుకు బరువైంది. రాత్రి పడుకునే ముందు 'దేవుడా తెల్లవారితే మాకు పని దొరకాలి.. ఇంటిల్లిపాది కడుపులు నిండాలి' అని వేడుకుంటారు. వేకువ జామునే నిద్రలేచి ఆశగా రోజు వెళ్లే సెంటర్‌కు వెళ్లి పడి కాపులు కాస్తారు. ఎవరో ఒకరు వచ్చి పనికి పిలుస్తారేమోనని ఆత్రుతగా ఎదురు చూస్తారు. ఉదయం 10 గంటలు దాటినా పని దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి భవన నిర్మాణ కూలీల పరిస్థితి దయనీయంగా మారింది.

'ఉచిత ఇసుక' అంటూ ఊదరగొట్టి ..

కూటమి నేతలు కల్లబొల్లి వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత ఇసుక ఒకటి. ఈ ఉచిత ఇసుక విధానం ఏమైందో అంతే లేకుండా పోయింది. ఉచిత ఇసుక సంగతి దేవుడెరుగు అసలు ఇసుకే కనిపించకుండా పోయింది. వైఎస్సార్ సీపీ పాలనలో సులభంగా అందుబాటులో ఉండే ఇసుక ఇప్పుడెందుకు లేదనేది పెద్ద ప్రశ్నగా తయారైంది. అంతెందుకు ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం నిల్వ ఉంచిన ఇసుకను టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన గంటల వ్యవధిలోనే తెలుగు తమ్ముళ్లు అక్రమంగా తరలించేశారు. గుట్టలుగా ఉన్న ఇసుక మేటలు సైతం అధికారి పార్టీ నేతల తాకిడికి కరిగిపోయాయి.

నిర్మాణరంగంపై పెను ప్రభావం

భవన నిర్మాణాలలో ఇసుకది అతి కీలకమైన పాత్ర. ఇసుక లేనిదే ఏ నిర్మాణాలు ముందుకు సాగవు. అలాంటిది గడిచిన నాలుగు నెలల నుంచి ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ ప్రభావం భవన నిర్మాణంపై పడింది. వైఎస్సార్ సీపీ పాలనలో ఒక ట్రాక్టర్ ఇసుక రూ. 3 వేలు లేదా రూ 4 వేలకు దొరికేది. ఇప్పుడు ఒక ట్రాక్టర్ ఇసుక రూ.8 వేల నుంచి రూ. 10 వేలు పలుకుతోంది. సవాలక్ష ఆంక్షలు దాటుకొని ఆ ఇసుకను కొందామంటే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇసుక సులభంగా దొరకక అధిక ధరలకు బ్లాకులో కొనలేక భవన నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో కడప నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా వేలాది నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి.

వలస వెళ్లిన కూలీలు

జిల్లాకు చెందినవారు,ఇక్కడికి వచ్చిన ఇతర జిల్లాలకు చెందిన వారు టీడీపీ కూటమి అధికారంలోకి వ చ్చాక యథావిధిగానే పనులు దొరుకుతాయని భావించారు. వారి ఆశలు అడియాశలుగా మిగిలాయి. ఈ నేపథ్యంలో వినాయక చవితి పండుగకు ముందే గుత్తి, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన వారు కొంతమంది తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. మరికొందరు బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లారు. ఇక్కడి వారు సైతం ఇతర ప్రాంతాలకు వెళ్లారని పలువురు భవన నిర్మాణ కార్మికులు తెలిపారు.

నాటి సంక్షేమ ఫలాలు అందక అవస్థలు

వైఎస్సార్ సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలయ్యేవి. అందుకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవి. దీంతో వారు అభివృద్ధి చెందడమే గాక ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో దోహదపడేది. పైగా ఇసుక లాంటి ముడిసరుకుకు ఎలాంటి ఢోకా లేక వెల్లువలా నిర్మాణ పనులు జోరుగా సాగేవి. ఇప్పుడా సంతోషకరమైన రోజులు మచ్చుకైనా కనిపించలేదు. ఇటు కూలి పనులు దొరక్క, అటు సంక్షేమ పథకాలు అందక పేద కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ మంచి రోజులు మళ్లీ ఎప్పుడొస్తాయో అని ఆశపడుతున్నారు.

కూలీల దుస్థితి దయనీయం

జిల్లావ్యాప్తంగా వేలాదిమంది మంది కూలీలు భవన నిర్మాణాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా కడప నగరానికి కర్నూలు, గుత్తి, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే బాడుగ ఇళ్లల్లో నివసిస్తూ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. కేవలం కడప నగరంలోనే 4000 మందికి పైగా కూలీలు ఉన్నారు. ఒకరోజు పనికి వెళితే ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒకరికి కూలి కింద మేసీకి రూ.1200, బేల్దారికి రూ. 1000, మగ కూలీకి రూ. 700 నుంచి రూ. 800, మహిళా కూలీకి రూ. 600 వస్తుంది. ఆ వచ్చే కూలీ డబ్బులతోనే ఇంటిల్లిపాది జీవనం గడుస్తుంది. నాలుగు నెలల నుంచి ఒక నెలలో కనీసం నాలుగు రోజులు పాటు కూడా ఎలాంటి పనులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కడప సంధ్యా సర్కిల్‌లో నిలబడి పనుల గురించి చర్చించుకుంటున్న కూలీలు

ఇసుక లేదు..పని లేదు



చాలాకాలంగా బేల్దారి పనికి వెళుతున్నాను. నాలుగు నెలల నుంచి ఇసుక లేనందున ఎవరూ పనులను పెట్టుకోలేదు. దీంతో మాకు కూలీ దొరకలేదు. రోజూ సెంటర్‌కు వచ్చి కూలీపనులు లేకపోవడంతో ఇంటికి వెళ్లిపోతున్నాను. - వెంకటయ్య, చెన్నూరు

రూ. 3 వేలు ఇంటి బాడుగ కూడా కట్టలేకున్నాం



మేము బేల్దారి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఇటీవల కాలంలో వారంలో ఒకరోజు కూడా పని దొరకడం లేదు. దీంతో నెలకు రూ. 3000 ఇంటి బాడుగ కట్టడం కూడా కష్టంగా మారింది. మా పరిస్థితి చాలా దయనీయంగా మారింది. - సంటెమ్మ, కర్నూలు

ఈ ప్రభుత్వంలో కడుపు నింపుకోవడమే కష్టం



నేను నలుగురిని పోషించాలి. ఈ వయస్సులో కూడా నేను కష్టపడటం తప్పడం లేదు. అదేంటోగానీ ఈ ప్రభుత్వం వచ్చాక ఒకరోజు కూడా కూలీ పని దొరకడం లేదు. అందరూ ఇసుక లేదని అంటున్నారు. అంతకుముందు ఐదేళ్లు మా జీవనం సాఫీగా సాగేది. - గోవిందమ్మ, కర్నూలు

కూలీ లేదు...సంక్షేమ పథకాలు లేవు



ఈ ప్రభుత్వం వచ్చాక మాకు కూలీ పనులు లేవు. సంక్షేమ పథకాలు ఏవీ అందడం లేదు. మాలాంటి వారందరూ కడు పేదరికంలో మగ్గిపోతున్నారు. కనీసం పనులు కూడా లేకపోతే మేం ఎలా జీవించాలి? మా జిల్లాకు చెందిన వారు చాలామంది సొంతూర్లకు, వేరే రాష్ట్రాలకు వెళ్లారు. - ఖాజాబీ, కర్నూలు

క్లుప్తంగా

గల్ఫ్‌లో బుగ్గలేటిపల్లె వాసి అనుమానాస్పద మృతి


ఉప్పు నాగేంద్రబాబు (ఫైల్)

వల్లూరు(చింతకొమ్మ దిన్నె) : చింతకొమ్మ దిన్నె మండలం బుగ్గ లేటిపల్లె గ్రామానికి చెందిన ఉప్పు నాగేంద్రబాబు(42) గల్ఫ్‌లో మృతిచెందగా, మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. నాగేంద్రబాబు జీవనోపాధి నిమిత్తం సంవత్సరం కిందట గల్ఫ్ దేశానికి వెళ్లారు. అక్కడ పనిచేసుకుంటుండగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల వినతి మేరకు మృత దేహాన్ని ఇంటికి తీసుకువచ్చేందుకు కలెక్టర్, ఎస్పీ, కమలాపురం ఎమ్మెల్యే కృషి చేశారు. 45 రోజుల తర్వాత సోమవారం గల్ఫ్ నుంచి మృత దేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. మృతదేహానికి బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఏఎస్ఐ కుటుంబీకులకు ఆర్థికసాయం


ఏ.ఎస్.ఐ సతీమణికి చెక్కు అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఐ ఆర్.అన్వర్ కుటుంబీకులకు అదనపు ఎస్పీ(పరిపాలన) కె. ప్రకాష్‌బాబు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐ సతీ మణి బీబీజాన్‌కు సంబంధిత రూ.2.5 లక్షల చెక్కును ఆయన అందజేశారు. పోలీస్ వితరణ నిధి నుంచి ఆ మొత్తం అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, బి.శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

స్విమ్స్ వైద్య బృందం పరిశీలన


కడప రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖను కలిసిన తిరుపతి స్విమ్స్ వైద్య బృందం

కడప అర్బన్ : కడప ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్)ను తిరుపతి స్విమ్స్ వైద్యులు డాక్టర్ కిరీటి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పార్థ సారథి మంగళవారం పరిశీలించారు. వైద్యకళాశాలలో ప్రస్తుతం గైనకాలజీలో 8, డెర్మటాలజీలో 4, పీడియాట్రిక్స్‌లో 4 పీజీ సీట్లు అందుబాటులో వున్నాయి. వీటికి అదనంగా ఒక్కో విభాగానికి నాలుగు పీజీ సీట్లు పొందడానికి ఏడీఎంఈ డాక్టర్ ఎ.సురేఖ ఎన్టీఆర్ యూనివర్శిటీ, డీఎంఈకి ప్రతిపాదనలు పంపారు. దీంతో స్విమ్స్ వైద్యులు వచ్చి ఆయా విభాగాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.సురేఖ, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ వంశీధర్, వైద్యులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి.. బాధ్యతలు చేతికి

అధికారం మాదే.. ఏమి చేసినా చెల్లుతుందనే ధోరణిలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నిబంధనలను గాలికొదిలేసి తమకు నచ్చిన వారితో సమగ్ర శిక్షలోని ఖాళీ పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట మనుషుల నుంచి వాచ్‌మెన్ వరకు తొలగించి వాళ్ల సహచరులను నియమించుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఇద్దరి నియామకం
- గుట్టుచప్పుడు కాకుండా బాధ్యతల స్వీకరణ
- సమగ్ర శిక్షలో మరో రెండు కీలక పోస్టులు ఖాళీ


కడపలోని సమగ్రశిక్ష కార్యాలయం

కడప టాస్క్‌ఫోర్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలకమైన సమగ్ర శిక్ష పలు ఆరోపణలు ఎదుర్కొంటోంది. నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఇటీవల కడప సమగ్ర శిక్ష కార్యాలయంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ), అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్(ఏపీవో) పోస్టులు భర్తీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర సమగ్ర ప్రాజెక్టు అధికారులు నోటిఫికేషన్ ఇస్తే.. నిబంధనలు, అర్హతల మేరకు జిల్లా విద్యాశాఖ మాత్రమే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రధాన పోస్టులకు ఎంఈఓ, హెచ్ఎం స్థాయి అధికారులను నియమించాల్సి ఉంది. కలెక్టర్, ఏపీసీ, డీఈఓ, డైట్ ప్రిన్సిపల్‌తో కూడిన కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి అన్ని విద్యార్హతలు, టెక్నికల్ నాలెడ్జ్ పరిశీలించి.. ఆ పోస్టులు భర్తీ చేస్తారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విద్యార్హతలేవీ లేకుండా కేవలం స్కూల్ అసిస్టెంట్ స్థాయి వారిని నియమిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అందులోనూ ఆ పోస్టుల భర్తీకి సంబంధించి సబ్జెక్టులో నిష్ణాతులైన వారినే మాత్రమే ఎంపికచేయాల్సి ఉంది.

వారి విధులు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ పరంగా ఏఎంఓ కార్యక్రమాలను పర్యవేక్షించాలి. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించడం, వారికి శిక్షణ ఇవ్వడం చేయాలి. స్కూల్ అసిస్టెంట్ స్థాయి వ్యక్తిని నియమిస్తే ఆయన ఏ విధంగా పర్యవేక్షిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసిస్టెంట్ పోగ్రాం ఆఫీసర్ (ఏపీఓ) కూడా సమావేశాలు నిర్వహించి పాఠశాలల సమచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, నాడు- నేడు పనులను అప్‌డేట్ చేయడం, బిల్లులు చెల్లించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు ఓ లాంగ్వేజ్ టీచర్‌ను ఎంపిక చేశారనే విమర్శలు వినవస్తున్నాయి. ఆమె అన్నమయ్య జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు కావడంతో ఎలా పర్యవేక్షిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కీలక పోస్టుల భర్తీ ఎప్పుడో?

సమగ్ర శిక్ష కీలకమైన పోస్టు జిల్లా ప్రాజెక్టు అధికారి. గతంలో ఈ స్థానంలో పనిచేసిన జిల్లా అధికారి ఫారిన్ సర్వీస్ గడువు ముగియడంతో తన మాతృ సంస్థకు రీపాట్రియేషన్‌పై వెళ్లిపోయారు. గత ఎనిమిది నెలలుగా అ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సమగ్ర శిక్షలో జరగాల్సిన కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలున్నాయి. మరో కీలక పోస్టు అకౌంట్ ఆఫీసర్. గత మూడు నెలలుగా ఖాళీగా ఉంది. ఉద్యోగులకు జీత భత్యాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయడం వంటి పనులు నిర్వహించాల్సి ఉంది. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమగ్రశిక్ష కార్యాలయంలో అన్ని పోస్టులకు అర్హులనే నియమించాలని సిబ్బంది కోరుతున్నారు.

కష్టాలతో వచ్చే వారికి అండగా ఉండండి


కమలాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కమలాపురం/వల్లూరు : కష్టాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అండగా ఉండి వారికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. కమలాపురం, వల్లూరు పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, ఇన్వెస్టిగేషన్‌పై సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడులతో ఆరా తీశారు. అనంతరం ఆవరణంలో కలియదిరిగి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మద్యపానం అరికడితే నేరాల శాతం తగ్గుతుందన్నారు. రానున్న లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్పగిరి క్షేత్రంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రోషన్, ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

'బాలగొండ' ప్రతిభను చాటిన అవార్డు

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య


బాలగొండ గంగాధర్‌ను సత్కరిస్తున్న జయన్న

కడప కల్చరల్: చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్ అందుకున్న రాష్ట్ర పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు ఆయన ప్రతిభను చాటిందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. లలిత కళాభిరామ పింఛము సంస్థ మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ గంగాధర్ చరిత్రపై లోతైన పట్టు గల వ్యక్తి అని, రాయలసీమ పర్యాటకంపై ఆయనకు మక్కువ ఎక్కువని ప్రశంసించారు. ప్రొద్దుటూరు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ టూరిజం అభివృద్ధికి లలిత కళాభిరామ పింఛము, తదితర సంస్థలు తోడుగా నిలుస్తున్నాయన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ విజయభాస్కర్ మాట్లాడుతూ రాయలసీమ టూరిజం అభివృద్ధికి చేస్తున్న కృషికి మరిన్ని అవార్డులు ఇచ్చినా తక్కువేనని అన్నారు. అనంతరం గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోతుల వెంకట్రామిరెడ్డి, గొల్లపల్లి జయన్న, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండూరు జనార్దన రాజు, జయన్న, మంజుల, వెంకటరమణ, గౌబ్బూరి కోటేశ్వరరావు, నసీబ్, శంకర రెడ్డి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు ఎంపిక


ఖాసింవలి

కలసపాడు: మండలంలోని చింతలపల్లె దళితవాడ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షేక్ ఖాసింవలి 2024 సంవత్సరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు అర్పిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు గణగళ్ల విజయకుమార్ తెలిపారు. ఖాసింవలి మాట్లాడుతూ విద్యా బోధనతోపాటు వివిధ సామాజిక రంగాలలో విశేషమైన కృషి చేసిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారని, ఆ అవకాశం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 21వతేదీన విజయవాడలో అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

అర్చకుల వేతనం పెంపు

కడప కల్చరల్ : దేవదాయశాఖ పరిధిలోగల దేవాలయాల్లో సేవలు అందిస్తున్న అర్చకులకు వేతనాన్ని పెంచారు. సోమవారం ఈ మేరకు జీఓ నెంబరు 665ను జారీ చేశారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో సేవలు అందిస్తున్న అర్చకులకు ధూప దీప నైవేద్యం కింద ఇంతవరకు ఇస్తున్న రూ. 5 వేల పారితోషికాన్ని రూ. 10 వేలకు పెంచుతున్నట్లు జీఓలో తెలిపారు. ఇంతవరకు వారికి ఇస్తుండిన రూ. 5 వేల పారితోషికంలో రూ. 3 వేలు అర్చకునికి జీతంగా, రూ. 2 వేలు ధూప దీప నైవేద్యానికి ఉపయోగించేవారు. సవరించిన మేరకు రూ. 5 వేల నుంచి వేతనాన్ని రూ. 10 వేలకు పెంచడంతో ఇందులో రూ. 7 వేలు అర్చకునికి వేతనంగా, మిగతా రూ. 3 వేలు ధూప దీప నైవేద్యానికి ఉపయోగించాలని జీఓలో సూచించారు. పెరిగిన ఈ మొత్తాన్ని కూడా కామన్ గుడ్ ఫండ్ నిధుల నుంచి సమకూర్చనున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె : వేంపల్లె మండలం చింతలమడుగు పల్లె సమీపంలో పేకాడుతుండగా నలుగురిని అరెస్టు చేసినట్లుఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇంటిలోకి దూసుకెళ్లిన లారీ


దూసుకెళ్లిన లారీ

ముద్దనూరు : జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ప్రయాణిస్తున్న ఓ లారీ.. ఆర్టీపీపీ రహదారి వద్దకు రాగానే అదుపుతప్పింది. గేట్ సమీపంలో నిలిపిన ఓ కారు, ఆటో, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని ప్రక్కనే వున్న ఇంటి ఆవరణంలోకి దూసుకెళ్లింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మానవాళికి హానికరమైన నిషేధిత కార్బన్ పొడి తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించలేదని స్థానికులు తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

- అక్టోబర్ 16 నుంచి నిరక్షరాస్యుల సర్వే
- డీఆర్వో గంగాధర్‌గౌడ్


మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. డీఆర్వో చాంబర్‌లో మంగళవారం జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడుతూ అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారని తెలిపారు. 15ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన వారికి ప్రాథమిక, డిజిటల్ విద్య అందించడమే పథకం లక్ష్యమన్నారు. జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు డీఆర్‌డీఏ క్లస్టర్ కో ఆర్డినేటర్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యుల సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేలో గుర్తించిన నిరక్షరాస్యులకు నవంబర్ 5వతేదీ నుంచి మార్చి 15వతేదీ వరకు పలు అంశాలపై టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ కేంద్రాలలో సాయంత్రం వేళ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. రాబోయే ఏడాది మార్చిలో అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఈ పథకానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఎంవీ.సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ. ఆనంద్‌నాయక్, డీఈఓ అనురాధ, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్, జిల్లా పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక


జిల్లా బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఫిజికల్ డైరెక్టర్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా బాల, బాలికల జట్టుకు క్రీడాకారుల ఎంపిక మంగళవారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణ కుమారి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. జిలానీబాషా, బి.శివశంకర్‌రెడ్డి, ఎం.ప్రవీణ్‌కిరణ్, సుదర్శన్ సిద్ధిఖ్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలికలు: ఎల్.పూర్వజ, బి.హరిణిలలిత బాయి, కె.హ్రితిక, ఎస్. శృతిక, వి.శ్రీకావ్య

అండర్-14 బాలలు: ఎం.ఆదిత్య, ఎఎస్.ఆదినారాయణరెడ్డి, సివి.గీతేష్‌రెడ్డి, డి.ఈశ్వర్, పి.ప్రన్షు

అండర్-17 బాలికలు: పి.శ్రీవల్లి, జెఎం.గీతిక, ఎం.కల్యాణి, కె.ప్రణవి, వై.చర్షిత

అండర్-17 బాలలు: ఎల్.సుప్రీత్‌రెడ్డి, ఎస్.ఫాజిల్ మాలిక్ సాహెబ్, సి.విశ్వతేజ, సి.త్రివిక్రమ్, జి.నాగ జటీశ్వర్

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా జట్టు...



ఎస్‌జీఎఫ్ జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ జట్టు

కడప నగరంలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి కె.జగన్నాథరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని సూచించారు. అనంతరం జిల్లా జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో బి.అరుణకుమారి, కలీముల్లా, ప్రవీణ్‌కిరణ్, దిలీప్‌చక్రవర్తి, వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలికల జట్టు: బి.శ్రీచందన, బి.గీతారాణి, జి.లెనిన్ ప్రియ, జి.రాజ్యలక్ష్మి, కె. శ్రీవెన్నెల, ఎం.సత్యవతి

జిల్లా బాలుర జట్టు: ఎస్.అర్షద్, వైవిఎస్.శివపవన్, ఎన్.అబ్దుల్ రెహమాన్, జె.అశోక్, జి.విష్ణు, ఐ.వి.కిరణ్‌కుమార్‌రెడ్డి

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

వేదామణెమ్మ సంతాప సభలో వైఎస్ విజయమ్మ తదితరుల నివాళి

పులివెందుల రూరల్ : మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ తల్లి చవ్వా వేదామణెమ్మ సంతాప సభ సందర్భంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల భవన్‌లో మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తొలుత వేదామణెమ్మ నివాసం వద్ద నిర్వహించిన సంతాప సభలో పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మతోపాటు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ సోదరులు వైఎస్ ఆనంద్‌రెడ్డి, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డిలతో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులు, కుమారులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లు పాల్గొన్నారు. కాగా, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నూర్‌బాష సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డిల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.

జనావాసాల్లో మద్యం దుకాణాలు వద్దు

కలెక్టరేట్ వద్ద ప్రొద్దుటూరు వాసుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ప్రొద్దుటూరు వాసులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట, సాయిబాబా కొట్టాలలో జనావాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ వద్ద ఆయా గ్రామస్తులతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. చంద్ర మాట్లాడుతూ సాయి బాబా, గాయత్రీదేవి, రాఘవేంద్రస్వామి ఆలయాలతోపాటు, మున్సిపల్ హైస్కూల్ ఉన్న ప్రాంతాల్లో దుకాణం ఏర్పాటుచేస్తే మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. గదిని మద్యం షాపుకు ఇవ్వరాదని కోరగా, ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఉమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు ప్రజలను దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. మద్యం షాపు రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. దానిపై విచారించి చర్యలు తీసుకోవాలంటూ ఎక్సైజ్ అధికారులను ఆదేశిస్తామని జేసీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ బాదుల్లా, గంగా సురేష్, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి

తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు


దాడిలో గాయపడిన భార్గవ్, వెంకటరమణ

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో దళితులైన తండ్రీకొడుకులపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ తులసి నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన దళితులైన వెంకటరమణ, కుమారుడు భార్గవ్‌లను అదే గ్రామానికి చెందిన గజ్జల చంద్రశేఖర్ రెడ్డి, గజ్జల చాణిక్య రెడ్డి, చాకలి ఓబులేసు, వడ్డే శేఖర్, మేకల నాగరాజులు సోమవారం రాత్రి చంద్రశేఖర్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టి వారి పొలానికి సంబంధించిన అగ్రిమెంటుపై సంతకం చేయించారు. బాధితుడు భార్గవ్ తెలిపిన మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తులసి నాగప్రసాద్ తెలిపారు. గాయపడిన క్షతగాత్రులను పరామర్శించడానికి బుధవారం దండు వీరయ్య మాదిగ బలపనూరు గ్రామానికి వస్తున్నట్లు సమాచారం.

ఆర్మీ ఉద్యోగికి బెస్ట్ వర్కర్ అవార్డు


బెస్ట్ వర్కర్ అవార్డు అందుకుంటున్న అక్కిశెట్టిమనోహర్

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి అక్కిశెట్టి మనోహర్‌కు బెస్ట్ వర్కర్ అవార్డు దక్కింది. సికింద్రాబాద్‌లోని భారత రక్షణ శాఖ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఈఎంఈ) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం జరిగింది. ఉత్తమ సేవలందించిన పలువురికి లెఫ్టినెంట్ జనరల్ అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా బ్రాహ్మణపల్లెకు చెందిన అక్కిశెట్టి వెంకటసుబ్బయ్య, అమ్మణ్ణమ్మల తృతీయ కుమారుడు అక్కిశెట్టి మనోహర్‌కు ఈ అవకాశం దక్కింది. ఇండియన్ ఆర్మీ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ విభాగంలో ఆయన పనిచేస్తున్నారు. పదవీ విరమణ చేసినా ఆయన విశిష్ట సేవలందిస్తున్నారు. ఇది గుర్తించిన ప్రభుత్వం ఈఎంఈలో ల్యాబ్ అటెండెంట్ ఉద్యోగం ఇవ్వడమేగాక, నేడు బెస్ట్ వర్కర్ అవార్డు అందజేసింది.

ఘర్షణ కేసులో 12 మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

గోపవరం : ఇరు వర్గాల మధ్య ఘర్షణపై బద్వేల్ రూరల్ పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికుల వివరాల మేరకు.. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు తరచూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని రాచాయపేటకు చెందిన నాగిరెడ్డి శివారెడ్డి, సాల్వరాజు సోమవారం రాత్రి మద్యం మత్తులో ఘర్షణకు దిగారు. ఇరువురి వర్గీయులు రెండు బృందాలుగా విడిపోయి రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. బద్వేల్ రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది సంఘటనా ప్రాంతానికి వెళ్లి ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. నాగిరెడ్డి శివారెడ్డి ఫిర్యాదు మేరకు రాజుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సాల్వరాజు ఫిర్యాదు మేరకు శివారెడ్డి, మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

నీలి నింగిలో.. వెండి మబ్బులు

ఆకాశాన మేఘ మాలికలు.. చూసే హృదయానికి కళ్లుండాలేగానీ.. ప్రతి చిత్రం ఓ అపురూపమే.. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట చెరువు... చుక్క నీరు లేక ఇలా బోసిపోయింది. అల్పపీడనంతో మేఘాలు చుట్టుముట్టడంతో ఇదిగో ఇలా నీలి నింగిపై వెండిమబ్బులు కనిపించి అందరినీ అలరించాయి. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్



